# అహా నా పెళ్ళియంట....

'పెళ్ళి కానివారి బాధలు పెరుమాళ్ళ కెరుక' అన్నారు వెనుకటికెవరో. నన్నడిగితే, 'పెళ్ళయిన వారి బాధలు భర్తకెరుక' అనాలి. స్టాటిస్టిక్స్ ప్రకారం బ్రహ్మచారులు పెళ్ళయినవారికన్నా త్వరగా మరణిస్తారు. 'త్వరగా మరణిస్తే బావుణ్ను' అనుకుంటూ చాలాకాలం బ్రతకాలనుకున్నవారు హాయిగా పెళ్ళి చేసేసుకోవచ్చు.

వయసురాగానే పెద్దలంతా 'పెళ్ళి చేసుకోరా' అంటూ కుర్రాడి వెంట పడుతూంటారు. అలాగే ఈడేరిన అమ్మాయికి తగిన వరుడికోసం వెదుకుతూంటారు. నిజానికి వివాహం ఈడేరిన అమ్మాయికో, వయసొచ్చిన కుర్రాడికోకాదు ముఖ్యం. విందు భోజనం కోసం ఎదురు చూసే పెద్దవాళ్ళకి. ఎంచక్కా పెళ్ళిలో బంధుమిత్రులందర్నీ కలుసుకుని కబుర్లు చెప్పుకుంటూ కారప్పూస, లడ్డూలు తినచ్చని.

బ్రిటన్‌లో ఆడవాళ్ళదే పైచేయి. ఇక్కడ మన పరిస్థితికి రివర్స్. భార్య దగ్గర భర్త అణకువగా లేకపోతే విడాకులిచ్చిపారేస్తుంది. ఓసారి తన భార్యతో సినిమాకి వెళ్ళడానికి యింటికి ఫోన్ చేసారట జోన్సుగారు. (మిస్టర్ జోన్స్) టెలిఫోన్ ఆపరేటర్ ఎంతకీ కనెక్షన్ ఇవ్వకపోగా 'మీలైన్ బిజీగా వుంది' అన్నదిట. అందుకా జోన్సుగారు బోలెడు ఆశ్చర్యంతో 'బిజీగా వుండే అవకాశంలేదు మిస్. నా భార్యతో మాటలున్నది నాకొక్కడికే. అది నేనామె భర్తని కాబట్టి తప్పడంలేదు' అన్నాట్ట. మిసెస్ జోన్సుగారి కేరక్టర్ యిట్టే అర్థం అవుతోందికదూ.

అంతలా కాకపోయినా ఇండియాలోని పరిస్థితి కూడా దాదాపు బ్రిటన్‌లోలా మారుతోందని చెప్పాలి. ముఖ్యంగా భార్య కూడా వుద్యోగం చేస్తున్న సందర్భాల్లో.

నా మిత్రుడొకడు బ్రహ్మచారి. అతను పెళ్ళి చేసుకోకపోవడానికో కారణం వుంది. ఓసారి సూపర్‌బజార్‌లో ఒకామె కాలుతొక్కాడు చూసుకోకుండా. ఆమె వెనక్కి తిరిగి ఆడపులిలా చూస్తూ ఏదో

చెప్పబోయింది. కాని నామిత్రుణ్ణి చూసిన మరుక్షణం ఆమె మొహంలో మార్పు వచ్చింది. మావాడు 'సారి' అనగానే మర్యాదగా నవ్వుతూ చెప్పింది – 'ఇట్సాల్ రైట్. మావారనుకుని నోరు జారబోయాను!'

అహమ్మదాబాద్‌లో యింకోమిత్రుడున్నాడు. ఈ వాక్యం నువ్వెక్కడయినా నవలల్లో రాయి అంటూ తరచు ఉత్తరాల్లో పెళ్ళిమీద తన అభిప్రాయాన్ని రాస్తూంటాడు. అలాంటివాటిలో కొన్ని.

– పెళ్ళిలాటరి లాంటిది అన్నవాడు శుద్ధవెదవ. ఎందుకంటే లాటరిలో గెలిచేవాళ్ళు అంటూ కొందరుంటారు.

– ఏ భర్తయినా తన భార్యని 'ఎందుకు ఏడుస్తున్నావ్?' అని అడగడం మానడం పెళ్ళయిన కొత్తల్లో నేర్చుకుని తీరుతాడు. ఎందుకంటే అది ఖర్చుతో కూడుకున్నపని కాబట్టి,

– బ్రహ్మచారి ఎంతో అదృష్టవంతుడు, తనలో ఎన్నిలోపాలున్నాయో చెప్పడానికి ఆడతోడు వుండదు కాబట్టి.

– పెళ్ళంటే ఒక యజమానికి ఒక బానిసని ఏర్పాటు చేయడం.

– కాని వాళ్ళు స్వర్గంగాను, అయినవాళ్ళు నరకంగాను భావించేది ఏమిటి?

– పెళ్ళి. అహమ్మదాబాద్ నించి వుత్తరం వచ్చినప్పుడల్లా నా మిత్రుడినించి యిలాంటి గొప్ప సత్యాలు నేర్చుకుంటూంటాను.

వెనకటి కొకడితో ఓ అమ్మాయి అన్నదిట.

"మన పెళ్ళయ్యాక నీ కష్టాలని నేను పంచుకుంటాను" అని 'నాకసలు కష్టాలే లేవంటే' ఆమె మన పెళ్ళయినప్పటిమాటనే చెప్పేది" అన్నదిట. సో ఆడవాళ్ళకి తెలుసు తమకి పెళ్ళవగానే భర్త అనేవాడి పరిస్థితి ఎలా వుంటుందో.

ఓసారి రైల్లో సూళ్ళూరుపేటనించి మద్రాసు వెళ్తుంటే యిద్దరు ఆడవాళ్ళు చాలాకాలం తర్వాత ఏక్సిడెంటల్‌గా కలుసుకోవడం నాకంట పడింది. మొదటమ్మాయి చెప్పింది. 'తప్పంతానాదే. దానికి నన్ను నేనే తిట్టుకోవాలి'.... వెంటనే రెండో అమ్మాయి 'అరె! అలాగా? నీకు పెళ్ళయిందని చెప్పావనుకుంటున్నాను' అన్నది.

ఈ పాయింట్‌నే ఓ తండ్రి తన కొడుక్కి యిలా చెప్పాడు.

'పెళ్ళయ్యాక అసలైన సంతోషం అంటే ఏమిటో నీకు తెలుస్తుంది' అని తండ్రి శెలవిస్తే 'నిజంగానా డాడి?' అని కొడుకు అడిగాడు. అవున్రా కాని అప్పటికే లేట్ అయిపోతుందనుకో. అది వేరేసంగతి' అని విషయం క్లియర్ చేసాడు.

మా పబ్లిషర్ తన భార్యతో ఓసారి మాఇంటికి భోజనానికి వచ్చారు. ఆవిడ మాటల్లో చెప్పింది. 'మా ఆయన ఎప్పుడు కరెక్టు అంటే తను చేసింది రాంగ్ అని ఒప్పుకున్నప్పుడు. మిగతా అన్ని సందర్భాల్లో ఆయన రాంగే.'

"ఏమిటి? మీ భార్యని పుష్కరిణిలో పోగొట్టుకున్నారా? థాంక్స్ ఫర్ టెల్లింగ్ దట్. మా ఆవిణ్ణి కూడా పుష్కరిణికి తీసుకెళ్తాను."

మొన్న యూరప్ పేకేజ్ టూర్‌లో వెళ్ళినప్పుడు మా రూంమేట్ గుప్తాజి, నేను హోటల్ గదిలోకి వెళ్ళాక మా సామాను గదిలో వుంచిన బెల్‌బాయ్ అడిగాడు యింకేమయినా చెయ్యాలా అని.

"ఉండు. టి.వి.ని ఎంత పెద్దగా కుదిరితే అంత పెద్దగా శబ్దం అయ్యేలా పెట్టు. బెడ్‌ను చిందరవందర చెయ్యి. బాత్‌రూంలోని టేప్‌లన్నింటిని ఆన్‌చేసి బయటకెళ్ళి ఆఫ్ చేయమని అరు. సూట్‌కేస్‌విప్పి బట్టలన్నీ గదినిండా చిందరవందరగా పడెయ్యి. 'నేనెంత గొడ్డులా పనిచేసినా మీకు తృప్తిలేదు' అని అరు.... ఇంటిమీద బెంగ మొదలయింది." అన్నాడు గుప్తాజి.

అలీఘర్‌లోని సదరు గుప్తాజి యింటికి ఓసారివెళితే ఇంట్లోలేడు. ఆయన ఆఫీస్‌కి ఫోన్‌చేస్తే చెప్పాడు.

'మా ట్రీజీ. నాతోపాటు ఓ ఫ్రండ్‌ని కూడా యింటికి భోజనానికి తీసుకువస్తున్నాను. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడు. వద్దని నచ్చ చెప్పడానికి ప్రయత్నిస్తున్నాను. ఆలస్యం కావచ్చు. ఏం అనుకోవద్దు.'

ఇక బ్రహ్మచారి గురించి.

'బ్రహ్మచారి అంటే అదృష్టవంతుడని తనకొడుక్కి ఖచ్చితంగా ప్రతితండ్రి ఏదో ఓరోజు ఓసారయినా చెప్పకపోడు' అంటారు

మా శతభిషం మాస్టారు. అందుకు రుజువేమిటంటే తన కొలీగ్ భార్య గేస్‌స్టవ్ పేలి మరణించిందని తెలీగానే తక్కున ఆయనా ఓ గేస్‌స్టవ్ కొనడమే. ఓసారి వాళ్ళింట్లో నేను భోజనం చేస్తూండగా ఆవిడగారు 'మళ్ళీ జన్మలో కూడా మనం భార్యాభర్తలుగా పుట్టాలండి' అంటే మా శతభిషం మాస్టారు 'దానికేం భాగ్యం కాని మరి అప్పుడు నామాట వింటావా?' అని ఆశగా అడిగాడు. ఆ రోజే తెలిసింది. శతభిషం మాస్టారి యింట్లో గోడకి వున్న పులి తల చరిత్ర. అది వాళ్ళ నాన్నగారు స్వయంగా చంపిన పులి.

'ఈ పులి తల మన వంశం అంతమయ్యేవరకు వుండాలి. దీనికి గౌరవ ప్రదమయినచోటు మన వంశ చరిత్రలో వుంది. నా భార్యని చంపింది ఈ పులే" అని చెప్పి ఇచ్చారట. 'కొద్దిగా తెలివి వుపయోగిస్తే చాలు వైవాహిక జీవితాన్ని సంతోషంగా మలచుకోవచ్చు' అని సెవెంటీ ఫైవ్‌లో నేను మా నాన్నగారికి వుత్తరం రాస్తే ఆయన తిరుగుటపాలో రాస్తూ 'నువు చెప్పింది నిజమే కావచ్చు. కాని ఆ తెలివికి మరికొంత తెలివిని చేర్చగలిగితే వివాహ జీవితానికే దూరంగా వుండి ఇంకాస్త సంతోషంగా వుండచ్చు' అని రాసారు. ఆయన మేధావి అని తర్వాత అర్థమైంది.

మా పెద్దనాన్నగారి వివాహానంతరం ఆయన మామయ్యగారు అడిగారట 'ఏమోయ్ అల్లుడు? నీ సంసారం మా అమ్మాయితో ఎలా వుంది?' అని. 'కొత్తగూడెంలో వడ్డీరెట్లు ఎలా వున్నాయో యిన్నాళ్ళకి పూర్తిగా అర్థమైందండి' అన్నారట మా పెద్దనాన్నగారు. అందుకనే అంటారు భార్యగా ఎన్నుకునే అమ్మాయిని, ఆమె మగాడు అయితే స్నేహితుడిగా ఎన్నుకుంటావా లేదా అని ఆలోచించి ఎన్నుకోవాలని. లేకపోతే యిది 'నా ఫైనల్ డెసిషన్' అనలేరు. "ఇది నా 'సెమి' ఫైనల్ డెసిషన్" అనాల్సి వస్తుంది.

ఓ ఎక్స్ – కొలీగ్ ఓసారి బస్‌లో కలిసాడు. మాటల్లో నాతో చెప్పాడు? 'నిన్నరాత్రి లేట్‌గా ఇంటికెళ్ళాను. నా భార్య సెకండ్ షో సినిమాకి వెళ్ళామంది. హైఆఫీస్‌నించి ఇన్‌స్పెక్షన్‌కి ఆడిటర్స్ వచ్చారు.

ఇంతదాకా వాళ్ళు అడిగే కాగితాలు, ఫైళ్ళు వెదికి ఇస్తూ అలసిపోయాను. రేపు వెళ్దాం అన్నాను' అన్నాడు.

'అలాగా? ఇంతకీ సినిమా ఎలా వుంది?' అని అడక్కుండా వుండలేకపోయాను, ఆయన భార్య గురించి తెలుసుకాబట్టి.

ఊరికే అనలేదు పెళ్ళయిన రోజు మగాడి వయసు ఏడేళ్ళు పెరుగుతుందని. కాని పెళ్ళి జలుబులాంటిది. జీవితంలో ఓసారయినా రాక తప్పదు.

'నేనెన్నడూ విడాకుల గురించి ఆలోచించలేదు. హత్య? ఆలోచించాను!' పెళ్ళయిన ఓ కామెడి నటుడి మాటలివి. అతని పేరుమాత్రం అడక్కండి.

# ది డెత్ ఆఫ్ లిబర్టి

ప్రతి వూరికి ఈ ఫేజ్ వుందో లేదో నాకు తెలీదు కాని హైద్రాబాద్ నగరానికి మాత్రం వుంది. పాత సినిమాహాళ్ళని రెనొవేషన్ చేసి, అంటే ఎయిర్ కండిషన్డ్ చేసి, మంచి కుర్చీలు వేసి అది మళ్ళీ తెరవడం.

ఇంకో ఫేజ్ పాత సినిమా థియేటర్లని పూర్తిగా పడగొట్టి ఆ స్థానంలో అపార్ట్‌మెంట్స్ నిర్మించడం. మినర్వా, ప్లాజా సినిమా థియేటర్లని సమూలంగా పడగొట్టి స్కై స్క్రేపర్స్ నిర్మించారు. ఈ దెబ్బ లిబర్టీ సినిమా థియేటర్ మీద కూడా పడింది.

హైద్రాబాద్ తెలిసిన వాళ్ళందరికి లిబర్టి సినిమా థియేటర్ తెలుసు. కనీసం ఆ పేరయినా విని వుంటారు. మొన్న అటు వైపు వెళ్తూ చూస్తే ఆ థియేటర్ వుండాల్సిన చోట మొండి గోడలు కూడా లేవు. మొత్తం పూర్తిగా పడగొట్టారు. క్షణకాలం మనస్సు చివుక్కుమంది.

1966 లో ఒక సంవత్సరం పాటు నేను హైద్రాబాదులోని వివేకవర్థిని కాలేజీలో బి.కాం. మొదటి సంవత్సరం చదివాను. రాష్ట్రపతి రోడ్